



# సంతాపతీర్మానం

**వెంకోజీ** సమితికి అధ్యక్షుడు అయ్యాడనేసరికి అందరూ ఆనందించారు. ఈ ఆనందాన్ని వ్యక్తం చెయ్యడానికి ఒక సభ ఏర్పాటయింది. అందరూ వెంకోజీ గుణగణాలు ప్రశంసిస్తూ ఉపన్యసించారు. అతణ్ని అభినందించారు. గతించిన సంవత్సరాలలో సమితిలో జరిగిన అభివృద్ధి వెంకోజీ రెండవసారి అధ్యక్షుడు కావడంతో ద్విగుణీకృతం అవుతుందని ఆశించారు. తనకు జరిగిన సన్మానానికి సమాధానం చెప్పాడు వెంకోజీ.

"నేడు మన భారత దేశం ఎటువంటి క్లిష్ట పరిస్థితుల్లో ఉందో మీకు నేను చెప్పనవసరం లేదు. 1948లో పూజ్య బాపూజీ నిర్యాణం చెందిన నాటి పరిస్థితులు జ్ఞాపకానికి వస్తు-

పంచితనానికీ, నిజాయితీకి ఎక్కడైనా విలువ ఉన్నదేమో కాని ఈ ప్రపంచంలో మాత్రం కాదని పలువురి అనుభవం స్పష్టం చేస్తున్నది. ఈ రెండు గుణాలు ఎవరిని వరిస్తాయో వారికి శత్రువులై నిలుస్తాయి. ప్రాణం కూడా తీస్తాయి. ఇంకా దురదృష్టవంతులైనవారి విషయంలో స్వార్థంగా రూపొందుతాయి.

న్నాయి. మన గురువు, మన హితుడు, మనకి పెద్దగడ అయిన మన నెహ్రూ మనల్ని విడిచి వెళ్ళిపోయాడు. ఒకవిధంగా ఆలోచిస్తే మన నెహ్రూ మరణానికి మనమే కారకులము. మనలో అనైక్యము, మత కలహాలు, మన భాషా విభేదాలు, మన ఒత్తిడులు నెహ్రూ హృదయాన్ని, ఆత్మని ఎంత క్షోభింప జేశాయో? హిమవత్పర్వత సన్నిభమైన ఆయన మనస్సు ఎంత కుంగదీశాయో? దేశ ప్రజల్లో, భారత భూమిలో రైతులు కష్టించి పనిచేసే పంట పొలాల్లోని మట్టి అణువుల్లో కలియు డానికి ఆయన శరీరంలో ప్రతి అణువూ ఆత్రంగా స్పందించింది. అలాంటి ఆయన దేశంలోని కుళ్ళును, ఈర్ష్యని, ద్వేషాన్ని, ద్వంద్వ వ్యక్తిత్వాన్ని చూసి ఎంత ఖేదించారో! ఆత్మ విమర్శతో, స్వార్థ త్యాగంతో, నైతిక నిష్ఠతో నేడు మనం కార్యరంగంలోకి ఉరకాలి. ఈర్ష్యా ద్వేషాలు మరిచి, చేతులు కలిపి మనమంతా భారతదేశం పట్ల మన కర్తవ్యాన్ని నెరవేర్చాలి.” ఇలా సాగిపోయింది, అతని ఉపన్యాసం.

ముందు కుర్చీలలో గోపాలం కూర్చున్నాడు. అంతా విన్నాడు. ఆత్మ విమర్శ చేసుకున్నాడు. అతడేనాడూ ఒక్క దమ్మిడీ లంచం పుచ్చుకుని ఎరగడు. సమితి ఆఫీసులో గోపాలానిది చాలా ముఖ్యమైన సీటు. హెడ్ ఎకౌంటెంటు. సమితి ఆఫీసు నుండి ఇంటికి కాలవ తవ్వితే డబ్బు ప్రవహించేది. కాని, బాపూజీ ఆశయాలూ, నెహ్రూ ప్రబోధాలూ జీవితపు తొలి సంవత్సరాలలోనే అతని మనస్సులో గాఢంగా నాటుకుని అతని జీవిత లక్ష్యాలు జారీ చెయ్యడం ప్రారంభించాయి.

“ప్రజల్లో స్వార్థం లేనివాడు ఎవడయినా ఉన్నాడా? గోపాలంగారూ! మీరు చూపించగలరా ఒక్కణ్ణి” అన్నాడు మాధవయ్య, పక్కనే ఉన్న గోపాలంతోటి. మాధవయ్య ఒక కంట్రాక్టరు.

“ఆ ! ఎందుకు లేరూ? మహాత్ముడూ, వినోబా...”

గోపాలం మాట పూర్తి కాకుండానే మాధవయ్య, “ఆ మహాత్ముణ్ణి హత్య చేశారు. ఆ వినోబా భూదానోద్యమం మనం చూస్తున్నాంగా! భూదానం ద్వారా తరతరాలుగా భూమి లేనివాడు ఒకడు భూమి పుచ్చుకున్నాడనుకోండి. రేపు సహకార క్షేత్రాలు పెడతామంటే ముందు వాడే అడ్డుతాడు. ఒక సిద్ధాంతంగా చెప్పాలంటే స్వార్థంలేని మనిషికి ఉనికి లేదు. బ్రతుకుకోసం పోరాటం జీవ ధర్మ సూత్రం. ‘స్వయం తీర్ణః పరాంస్తారయేత్’. తన్ను మాలిన ధర్మమూ మొదలు చెడ్డ బేరమూనా? ఇలా ఎన్ని చెప్పమన్నారు?”

గోపాలానికి మాధవయ్య సిద్ధాంతం నచ్చలేదు.

# సంతాప తీర్మానం

కాని, గోపాలం మాధవయ్యకు ఎదురు సమాధానం చెప్ప లేదు. గోపాలం మనస్సు తర్కించడం మొదలు పెట్టింది. ప్రత్యక్ష జీవితానికి, సిద్ధాంతానికి ముడి వెయ్యడంలోనే ప్రజ్ఞ ఉంది. జీవితమనే మొక్క వికసించాలంటే సారవంతమైన భూమి, సూర్యరశ్మి, అనుకూల వాతావరణం అన్నీ కావాలి. ఇవన్నీ ఇతరుల చేతుల్లో ఉన్నాయి. అందుచేత గోపాలం ఒక్కడుగా ఏ ఫలితాన్నీ సాధించలేడు. సమితి ద్వారా ఏ మంచి పని జరగాలన్నా ప్రజలూ, ప్రజా ప్రతినిధులూ, ఉద్యోగులూ అందరి సహకారమూ కావాలి. ఇందులో ఫలితం ప్రజలది. అధికారం ప్రజా ప్రతినిధులది. అవస్థలు ఉద్యోగులవి. అయితే మనిషి పరిస్థితులకు బానిసా? పరిస్థితుల్ని మనిషి జయించగలడా? న్యూటన్ ఒకలాగ, మార్క్స్ ఒకలాగ చెప్పారు. శ్రీ కృష్ణుడు భగవద్గీత మూడవ అధ్యాయంలో ఒకలాగ, పదమూడవ అధ్యాయంలో ఒకలాగ చెప్పాడు. అందరూ ఒకలాగే చెబితే, న్యూటను, మార్క్స్, శ్రీ కృష్ణుడు ఇంత మంది ఎందుకు? ఒక్క “న్యూమాక్రిశ్” చాలదూ?

తన పిచ్చి ఆలోచనలకు తానే నవ్వుకున్నాడు, గోపాలం. సభలో చాలామంది జనం అప్పుడే వెంకోజీ వెనకాల వెళ్ళిపోయారు.

“అమ్మగారు మిమ్మల్ని తొందరగా ఇంటికి రమ్మంటు న్నారు, సార్!” అని వెంకట్రాజు చెప్పడంతోనే గోపాలం గుండె గుభేలుమంది. లేచి నిలబడ్డాడు. కళ్ళు కొంచెం నీరసంగా మూసుకుని తెరుచుకున్నాయి. ఇంటికి బయలు దేరాడు, గోపాలం.

డబ్బే గనక సర్వసుఖప్రదాయి అయితే గోపాలానికి అందుకు లోటులేదు. అన్నీ కలిపి రెండువందలు జీతం. తల్లి, భార్య, ఒక మగపిల్లవాడు, ఒక ఆడపిల్ల కలచిన్న సంసారం గోపాలానిది. పట్నంలో ఇల్లొకటి ఉంది. తనను కలెక్టరాఫీసునుండి సమితికి బదిలీ చెయ్యడం తోటే ఇంట్లో ఒక భాగం అద్దెకు ఇచ్చేసి, రెండవ భాగంలో బరువు సామాన్లు పడేసి, ఈ ఊరు వచ్చేశాడు. ఇక్కడా అతనికి శుభ్రమైన ఇల్లే దొరికింది. ఈమధ్య ప్రభుత్వం ఇచ్చిన అధిక వేతనంతో కూడికతో రేడియో కొన్నాడు. ఇదివరకే అతనికి ఫాన్ ఉంది. సమితి కార్యాలయాలు ఉన్న ఊరు పట్నం కాదు. తూజేపల్లె. అందుచేత ఒక ఆవును కూడా కొన్నాడు. ఇక అతని సుఖానికి లోటు ఏమున్నదని అనుకుంటారు జనం.

గోపాలం గుమ్మంలో అడుగు పెడుతూండగానే

జయంతి కామేశ్వరరావు

అతని భార్య సత్యవతి ఎదురుగా వచ్చి, “ఇక మీరు సన్యాసం పుచ్చుకోవడం మంచిది” అంది.

ఈ ధోరణికి గోపాలం అలవాటు పడిపోయాడు. సమాధానం చెప్పకుండానే పెరట్లోకి వెళ్ళి కాళ్ళు కడుక్కుని వచ్చి సావిట్లో కుర్చీలో కూర్చున్నాడు. ఎదురుగుండా సత్యవతి కూర్చుంది.

“ఇంతకీ అసలు సంగతి ఏమిటో చెప్పు!” అన్నాడు గోపాలం.

“అయినా నాకెందుకు? మీరు సత్య హరిశ్చంద్రులు. మీ అమ్మగారో అరుంధతి. ఇక నేనేగా రాక్షసిని?”

“నాకు ఇప్పటికి కూడా అసలు విషయం ఏమిటో బోధ పడలేదు.”

“ఎలా బోధ పడుతుంది? ఊళ్ళో సంగతులన్నీ బోధ పడతాయి. ఎక్కడలేని వ్యవహారాలూ పరిష్క రిస్తారు. లోకోద్ధారకులు. దేశభక్తులు. కాని ఎవరి సంసారాన్ని వాళ్ళు చక్కబెట్టుకోలేరు. అందరికీ శకునం చెప్పిన బల్లి కుడితి తొట్టెలో పడ్డదట.”

“వెంకట్రాజుతో నన్ను రమ్మని చెప్పావుటగా? ఎందుకూ అని అడుగుతున్నాను.”

“మీ అమ్మగారినే అడగండి వెళ్ళి” అంది సత్యవతి దెప్పినట్టుగా.

“నువ్వే రమ్మని చెప్పావని వెంకట్రాజు చెప్పాడు” అన్నాడు గోపాలం.

“మీతో ఎవరూ వాదించలేరు బాబూ? కాలికి వేస్తే మెడకి, మెడకి వేస్తే కాలికి వేస్తారు.”

“పోనీ, వాదించవద్దు. అసలు సంగతి చెప్పు” అన్నాడు గోపాలం. ఆగ్నేయాస్త్రం సంధించాలను కుంది సత్యవతి. వారుణాస్త్రం తొడిగింది.

“ఆ పొలుగింటి పుల్లమ్మగారికి ఇవేళ రెండు రూపాయలు ఇవ్వాలని చెప్పారా? ఆ విషయం మీకేమైనా జ్ఞాపకం ఉందా?” అంది.

“ఎందుకూ?”

“ఆవిడ తిరపతి వెళుతూంది. అందుకు.”

“ఆవిడ తిరపతి వెడితే మన మెందుకు రెండు రూపాయలివ్వాలి? మనం ఇస్తే ఆదేవుడు పుచ్చుకోడా?”

“అదుగో! ఆ తర్కమే వద్దన్నాను. ఆవిడికి నేను ఇస్తానన్నాను. అంతే. ఇవ్వాలి.”

“అయితే ఇయ్యి! దానికింత రాద్ధాంతం ఎందుకు?”

“అయ్యగారు ఒప్పుకోవాలిగా!”

“నేనైతే ఒప్పుకోను.”

“మీరు మరొకటి ఒప్పుకుంటారు గనకనా! ఆ గ్రామసేవిక వచ్చి ఏమి చెప్పినా ఒప్పుకుంటారు.”

“అలాంటి తప్పుడు కూతలే కుయ్యవద్దన్నాను. అది నా ఉద్యోగ ధర్మం.”

“ఉద్యోగ ధర్మమా! పుట్రేను పుట్టిన బుద్ధి పుడ కలతోగాని పోదు.”

వంట ఇంట్లో పిల్లలకు అన్నం పెడుతూన్న గోపాలం తల్లి లచ్చమ్మ విసవిసా వచ్చింది.

“నోటికి ఎంతమాట వస్తే అంతా అనెయ్యడమేనా ఏవిటే? ఆ నోటికి తలుపూ ద్వారబంధం ఏమన్నా ఉందా?” అంది.

లచ్చమ్మ రంగంలోకి రావడంతోనే దెబ్బలాట చిలికి చిలికి గాలివానగా మారింది. అత్తా కోడళ్ళ మధ్య హిందూ ముస్లిం మత కలహం లాంటిది జరిగింది.

ఇద్దరు మనుష్యులు ఒక ఇంట్లో సహజీవనం చెయ్యలేకపోతే ఇన్ని మతాలూ, ఇన్ని భాషలూ, ఇన్ని సంస్కృతులూ కలిసిన భారతదేశంలో జాతీయత ఐక్యం ఎలా పెరుగుతుందో అనుకున్నాడు గోపాలం. సత్యవతికి ఆ కోపోద్రేకం వల్ల శోషవచ్చి పడిపోయింది. గోపాలమూ తల్లీ ఆమెను మంచంమీద పడుకోబెట్టి ఉపచారాలు చేశారు.

"అమ్మా! దాని సంగతి నీకు తెలుసు గదా! నువ్వు ఊరుకుంటే ఏ గొడవా లేకపోయేదిగా!" అన్నాడు గోపాలం నెమ్మదిగా.

'అవునురా, నాయనా! నేనే గొడవ తెచ్చాను. దాని మాటలేమీ నీతలకెక్కవు. నీకా భగవంతుడు స్వతంత్రమైన బుద్ధి ఇస్తేగా! పెళ్లానికి బానిసలైనవాళ్ల గతి ఇంతే!' అనుకుంటూ ఆవిడ మళ్లీ వంట ఇంట్లోకి వెళ్లిపోయింది.

ఎలాగో రెండు మెతుకులు కతికి మంచంమీద చేరబడ్డాడు, గోపాలం. అతనికి స్త్రీజాతిమీద గొప్ప గౌరవం. తల్లిగా, భార్యగా, మంత్రిగా, దాసిగా స్త్రీకి సంఘంలో ఒక ఉన్నతమైన స్థానం ఉన్నదని అతని విశ్వాసం. అందుచేత ఇటు తల్లినిగాని, అటు భార్యనుగాని నిందించలేకపోయాడు. అందువల్ల వాళ్ళు వాళ్లకు రాజ్యాంగం ద్వారా వచ్చిన వాక్సభా ప్రచార స్వాతంత్ర్యాల్ని విరివిగా ఉపయోగించుకుని శక్తివంచన లేకుండా ఇంట్లో శాంతికి భంగం కలిగిస్తున్నారు.

మర్నాడు మామూలుగా ఆఫీసు చేరుకున్నాడు, గోపాలం. తన ఇల్లులాగే ఉంది దేశం. మాధవయ్య చెప్పినట్టు అందరూ స్వార్థపరులే. గోపాలానికి చిన్నతనంలో హిస్టరీ మాస్టారు చెప్పిన ప్రశ్నలు జ్ఞాపకానికి వచ్చాయి.

ప్ర: గజినీ దండయాత్రకు కారణమేమి?

జ: ధనకాంక్ష, కీర్తికాంక్ష, స్వార్థకాంక్ష.

సమితి పెద్దల కలహాలకు కారణం అదేగా! అత్తాకోడళ్ళ కలహాలకు కారణం అదేగా! చైనా రష్యా వివాదాలకు కారణం అదేగా! వెంకోజీ మాధవయ్యల జట్టీలకు కారణం అదేగా! వెంకోజీ సమితి అధ్యక్షుడు కావడానికి మాధవయ్య కారకుడు. మాధవయ్య కింగ్ మేకర్. నలభై గ్రామాల పంచాయితీ అధ్యక్షుల్ని బందెలదొడ్డిలో పెట్టి వెంకోజీకి మెజారిటీ ఓట్లు వేయించాడు మాధవయ్య. వెంకోజీ ప్రజల్లో ఉత్తముడుగా చలామణీ అయినంతకాలం మాధవయ్యకు మంచినీళ్ళు పుట్టవు. అందుచేత ఈ బందెలదొడ్డి తంత్రం వెంకోజీ చేయించినట్టు ప్రచారం చేశాడు మాధవయ్య. ఆనోటా ఆనోటా పడి ఆ కబురు తడిసి మోపెడై వెంకోజీ చెవిని చేరింది. వెంకోజీ తోక తొక్కిన తాచులా లేచాడు. మాధవయ్యకు నూతులకూ, బండి పట్టాలకూ, ఎరువులకూ, ఎన్ని ఋణాలు మంజూరు అయ్యాయో ఆఫీసులో ఆడిట్ చేశాడు. ఈ పరిశోధన ఫలితంగా చరిత్రాత్మక సత్యం ఇంకోలా బయటపడింది. కొన్ని నూతులకు అధ్యక్షుని ఆమోదం లేకుండానే మాధవయ్యకు డబ్బు ముట్టినట్టు ప్రాచీనపత్రాలు తెలియజేశాయి.

"ఇందుకు కారకు లెవరు?" అన్నాడు వెంకోజీ ఫైళ్లు తెచ్చిన గుమాస్తాపై కళ్ళెర్రజేస్తూ.

"చెక్కులు రాసినవారు అకౌంటెంటుగారండి" అన్నాడు గుమాస్తా.

"పిలు" అన్నాడు వెంకోజీ.

కొద్ది క్షణాల్లో ముద్దాయిగా నిలబడ్డాడు, గోపాలం.

"ఏమండీ, గోపాలంగారూ! మీరుకూడా ఈ పంచవర్ష ప్రణాళికలో భాగస్వాములేనా?" అన్నాడు వెంకోజీ వ్యంగ్యంగా.

"అవునండి. మనమందరమూ భాగస్వాములమే. అప్పుడు మీరేగా చెక్కులు రాసి తెమ్మన్నది? అప్పుడు మీకు చెప్పానుగూడాను, ఆ నూతుల శాంక్షను కాలేదని. 'మాధవయ్య బాధ పడలేకపోతున్నాను; ఈ డబ్బు ఇవ్వకపోతే పదిమంది పంచాయితీ అధ్యక్షుల చేత విశ్వాసరాహిత్య తీర్మానం ప్రవేశ పెట్టిస్తానంటున్నాడు' అని అన్నది మీరేగా!" అన్నాడు, గోపాలం.

"ఏమిటీ! దీనికింత కథ అల్లుకుని కూర్చున్నారా! నేనా? అలా అన్నానా?"

"ఆహా! ముమ్మాటికీ అన్నారు. అప్పుడు మన ప్యూను వెంకట్రాజుకూడా అక్కడే ఉన్నాడు" అని నిజం చెప్పాడు గోపాలం.

"ఎలక్కి తొండ సాక్ష్యమా! ఇదుగో, గోపాలంగారూ! మాధవయ్య మిమ్మల్ని రక్షిస్తాడనుకుంటున్నారు కాబోలు. ఇంకా నాసత్తా మీకు తెలియదు. ఇలాంటి అవినీతికి నేనెంతమాత్రం తల ఒగ్గేది లేదు. దీని మీద ఒక విచారణ సంఘం వేస్తున్నాను. అనుమానం మీద మిమ్మల్ని సస్పెండు చేస్తున్నాను" అని విసురుగా లేచి వెళ్లిపోయాడు, వెంకోజీ.

గోపాలం మళ్లీ ఆత్మవిమర్శ చేసుకున్నాడు. ఈ ప్రజా ప్రతినిధుల మధ్య తను ఒక పావిక అయిపోయాడు. తనను ఈ నిందనుండి కాపాడేవాడు ఉన్నాడో లేడోనని సందేహం కలిగింది, గోపాలానికి. నెమ్మదిగా ఇంటివైపు బయలుదేరాడు.

తనకు ఎదురుగా ఒక సంచీ చేత్తో పుచ్చుకుని తల్లి వచ్చింది. గోపాలాన్ని చూడగానే లచ్చమ్మ, "నాయనా! ఇహ నేను కొంపలో ఉండలేను. పోతాను" అని ఏడవడం ప్రారంభించింది.

"ఎక్కడికమ్మా?" అన్నాడు, గోపాలం.

"ఎక్కడికో వల్లకాట్లోకి. నువ్వూ నీ పెళ్లామూ సుఖంగా ఉండండి" అంటూ గోపాలాన్ని తప్పించుకుని విసురుగా వెళ్లిపోయింది, లచ్చమ్మ. గోపాలానికి ఏమి చెయ్యాలో తోచలేదు. విషయమేమిటో కనుక్కుందామని ఇంటికి వెళ్లాడు. వీధిలో నిలబడి గోపాలం అయిదేళ్ళ కొడుకు ఏడుస్తున్నాడు. గోపాలాన్ని చూడగానే వాడు మరీ బావురుమన్నాడు.

"ఏమిరా, నాన్నా!" అన్నాడు గోపాలం.

"అమ్మ పెరట్లో పడి పోయింది. అక్క ఇచురుతూంది. బామ్మ ఎక్కడికో వెళ్లిపోయింది" అన్నాడు, కుర్రాడు.

గబగబా పెరట్లోకి వెళ్లాడు గోపాలం. సత్యవతిని రెండు చేతులతోను ఎత్తి, తీసుకు వచ్చి మంచంమీద పడుకోబెట్టాడు. ముఖంమీద నీళ్ళు చల్లాడు. కొంతసేపటికి సత్యవతి కళ్ళు తెరిచింది. మంచినీళ్ళు తాగి కూర్చుంది.

"మా అమ్మ పెద్దది కదా! నువ్వే కాస్త తగ్గితే ఏగొడవా ఉండేదికాదుగా!" అన్నాడు నెమ్మదిగా, గోపాలం.

"అవును. మీరు సత్య హరిశ్చంద్రులు. మీ అమ్మ అరుంధతి. నేనేగా రాక్షసిని! ఈ రాక్షసిని ఎలాగైనా తీసుకుపోరా భగవంతుడా అని మొర పెడితే ఆ భగవంతుడికి కనికరం లేదు. నాపీడ విరగడైతే మీరూ అగ్రామసేవికా సుఖంగా ఉండరుగా!"

> అవసరంలో ఉన్న మనిషి మాట నెగ్గడం అసంభవం.
>
> —ఫ్రాంక్లిన్

ఇలా ప్రారంభించింది, సత్యవతి. అక్కడనించి లేచి వెళ్లిపోయాడు గోపాలం. వీధి అరుగుమీద మంచం వాల్చుకుని పడుకున్నాడు. వెన్నులో ఎక్కడో నొప్పి వచ్చింది. దానిమీద ఉష్ణం వచ్చింది. ఈ కబురు విని బస్సుకోసం కాసుకుని కూర్చున్న లచ్చమ్మ ఆదరా బాదరాగా ఇంటికి వచ్చేసింది.

స్థానిక వైద్యుడు వచ్చాడు. గోపాలం లక్షణాలు బాగా లేవు, విశాఖపట్నం తీసుకు వెళ్లిపొమ్మన్నాడు. సమితి ఆఫీసులో అందరికీ తెలిసింది. ఆఫీసు ఉద్యోగులంతా వచ్చారు. వెంకోజీ వచ్చాడు. సమితి జీపులో గోపాలాన్ని విశాఖపట్నం తీసుకువెళ్లారు. అక్కడి భిషగ్బృందం గోపాలాన్ని శ్రద్ధగా పరీక్షించింది. చెయ్యవలసిన వైద్యమంతా చేశారు. ఎన్నో మందులు పోశారు. కాని ఆయువు పొయ్యలేక పోయారు. గోపాలం చచ్చిపోయాడు.

"అయ్యో, సత్యవతీ! నీ పసుపూ కుంకుమ పోయి నాలాగే అయిపోయావే!" అని లచ్చమ్మ ఏడ్చింది.

"అయ్యో! వాదేవుడు నన్ను దిక్కుమాలిన పక్షిని చేసి వెళ్లిపొయ్యాడో" అని సత్యవతి ఏడ్చింది.

కొంచెం ఏడుపు మళ్లించుకుని డాక్టరుగారి దగ్గరికి వెళ్లింది, లచ్చమ్మ.

"బాబూ! మావాడికి ఏమి మాయదారి రోగం వచ్చింది బాబూ?" అని అడిగింది.

ఆవైద్యబృందం నాయకుడు, "అమ్మా! [illegible] మాటంగా చెప్పాలంటే ఇది మెదడుకి సంబంధించిన జబ్బు. ఇది గృహచ్ఛిద్రంవల్ల, మానసిక శాంతి చెడిపోవడంవల్ల వస్తుంది" అని చెప్పాడు.

ఆ మాటలు వినడంతోటే లచ్చమ్మ నెత్తీ, నోరూ మొత్తుకుంది.

"అయ్యో, సత్యవతీ! నువ్వూ నేనే చంపుకున్నామే మన మాణిక్యాన్ని. నువ్వూ నేనూ పోట్లాడుకోకుండా ఉంటే ఇంతవరకూ వచ్చేది కాదే!" అని చెప్పుకుని ఇద్దరూ కలిసి హృదయవిదారకంగా ఏడ్చారు.

గోపాలానికి అంత్యక్రియలు జరిగాయి. మరో రెండు రోజుల తరవాత పంచాయితీ సమితి ఆఫీసులో సంతాప సభ జరిగింది. వెంకోజీ అధ్యక్షత వహించాడు. గోపాలం గుణగణాలు నైతికనిష్ఠ, ఉద్యోగ ధర్మతత్పరతలను గురించి పలువురు ప్రసంగించారు. కింది తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదిస్తూ సభ్యులు మౌనంగా నిలబడి గోపాలానికి శ్రద్ధాంజలి ఘటించారు.

"శ్రీ గోపాలం అకస్మాత్తుగా స్వర్గస్థుడయినందుకు ఈ సభవారు తమ గాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నారు. ఆయన నీతి నియమాలూ, నిష్కాపట్యమూ, సేవానిరతీ అనుపమానమైనవి. ఇతరులకు ఆదర్శప్రాయమైనవి. ఆయన కుటుంబానికి ఈ సభవారు తమ హృదయపూర్వకమైన సానుభూతి ప్రకటిస్తున్నారు." ★